సాక్షి మహబూబ్‌నగర్

బుధవారం । 27 । మార్చి । 2024

ఇఫ్తార్ 6-37
(బుధవారం సాయంత్రం)

సహర్ 4-55
(గురువారం తెల్లవారుజామున)

రంజాన్ వేళలు



ముగిసిన బ్రహ్మోత్సవాలు

కందూర్‌లో శ్రీరామలింగేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు మంగళవారం ముగిశాయి.

వివరాలు 8లో ▸

గరిష్ఠం/కనిష్ఠం
40.3 /19.9

వాతావరణం

ఆకాశం నిర్మలంగా ఉంటూ అప్పుడప్పుడూ మేఘావృతమవుతుంది. మధ్యాహ్నం ఎండ ప్రభావం ఎక్కువగా ఉంటుంది.

న్యూస్‌రీల్

ప్రపంచ ఆరోగ్య సంస్థ సూచనలు పాటించాలి



మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లాకేంద్రం లోని ఎన్టీఆర్ మహిళా డిగ్రీ కళాశాలలో మంగళవారం జీవ వైవిధ్య పరిరక్షణ, మానవ జీవితాలపై ప్రభావం అనే అంశంపై బయోఫెస్ట్ ఆరోగ్య శిబిరం నిర్వహించారు. కార్యక్రమానికి డీఎంహెచ్‌ఓ కృష్ణ హాజరై మాట్లాడారు. ప్రతి ఒక్కరు ఆరోగ్యంగా, మానసికంగా, సామాజికంగా సర్దుబాటు కలిగి ఉండాలని, ప్రపంచ ఆరోగ్య సంస్థ సూచనల ప్రకారం ఆధ్యాత్మిక అంశాలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. అప్పుడే ప్రతిఒక్కరు చదువులో గాని, వృత్తిలో గాని పూర్తిస్థాయిలో న్యాయం చేయగలరని అభిప్రాయపడ్డారు. ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవాలని లేకపోతే అనారోగ్య సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. రొమ్ము కాన్సర్, ఎనీమియా, గుండె సంబంధిత వ్యాధులపై అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం కళాశాలలో ఆరోగ్య శిబిరం నిర్వహించి, పలువురు విద్యార్థినులకు అవసరమైన మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యులు ప్రవీణ, గౌతమి, ప్రిన్సిపాల్ విజయ్ కుమార్, గంగాధర్, అమీనా ముంతాజ్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

రూ.11 లక్షల నగదు సీజ్



మహబూబ్‌నగర్ క్రైం: జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం జిల్లావ్యాప్తంగా విస్తృతంగా వాహనాల తనిఖీలు నిర్వహించారు. బాలానగర్‌లో డీఎస్పీ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో కార్ల తనిఖీ చేపట్టారు. మహబూబ్‌నగర్ టూటౌన్ పోలీసులు న్యూటౌన్‌లో చేసిన తనిఖీల్లో బాలరాజు అనే సేల్స్‌మెన్ దగ్గర ఎలాంటి డాక్యుమెంట్స్ లేకుండా ఉన్న రూ.5.50 లక్షల నగదు సీజ్ చేశారు. వన్‌టౌన్ పోలీసులు క్లాక్‌టవర్ దగ్గర చేసిన తనిఖీల్లో మార్కెటింగ్ ఏజెంట్ మల్లిఖార్జున్ దగ్గర రూ.1.50 లక్షలు స్వాధీనం చేసుకున్నారు. అదేవిధంగా వన్‌టౌన్ పోలీసులు కోయిలకొండ ఎక్స్ రోడ్‌లో చేపట్టిన తనిఖీల్లో దేవుజా నాయక్, మంగలి ఆంజనేయులు అనే వ్యక్తుల దగ్గరి నుంచి 48 లీటర్ల మద్యం సీజ్ చేశారు. బాలానగర్ పోలీసులు చేసిన తనిఖీల్లో రూ.2.14 లక్షల నగదు పట్టుబడగా 19.200 లీటర్ల మద్యం సీజ్ చేయడం జరిగింది. దీంతోపాటు జడ్చర్ల పోలీసులు రూ.1.90 లక్షల నగదు సీజ్ చేశారు.

1 నుంచి ధాన్యం కొనుగోలు కేంద్రాలు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: జిల్లాలో వచ్చే నెల 1 నుంచి దశల వారీగా వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తామని కలెక్టర్ రవినాయక్ అన్నారు. మంగళవారం హైదరాబాద్‌లోని సచివాలయం నుంచి సీఎస్ శాంతికుమారి కలెక్టర్లతో వీసీ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆయా కేంద్రాల్లో అవసరమైన ప్యాడి క్లీనర్లు, వేయింగ్, తేమ యంత్రాలు, ఇతర సామగ్రిని సిద్ధం చేస్తున్నామని, వేసవి దృష్ట్యా అవసరమైన సదుపాయాలు కల్పిస్తామన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని కట్టుదిట్టంగా అమలయ్యేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. 2023–24 ఖరీఫ్ సీజన్‌కు సకాలంలో సీఎంఆర్ బియ్యం సరఫరా పూర్తయ్యేలా రైస్ మిల్లులు పర్యవేక్షిస్తామన్నారు. అనంతరం కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో కలెక్టర్ మాట్లాడారు. ధాన్యం దిగుబడి ప్రకారం అన్ని ఏర్పాట్లు చేయాలని సూచించారు. సమావేశంలో డీఎస్‌ఓ శ్రీనివాస్, పౌర సరఫరాల డీఎం ప్రవీణ్, డీసీఓ పద్మ, డీఆర్‌డీఓ నర్సింహులు, మిషన్ భగీరథ ఈఈ పుల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాలమూరులో ప్రకంపనలు!

ఫోన్ ట్యాపింగ్ ఎపిసోడ్‌లో మలుపులు

- మహబూబ్‌నగర్ జిల్లాకు మరకలు
- అప్పటి విపక్ష నేతలు, వ్యాపారులు, రియల్టర్ల ఫోన్లు ట్యాపింగ్
- ఓ మాజీ మంత్రి, పలువురు పోలీస్ అధికారుల ప్రమేయం
- డీజీపీకి ఎమ్మెల్యే యెన్నం ఫిర్యాదుతో కలకలం
- ఏ-1 నిందితుడు ఇంటెలిజెన్స్ మాజీ ఐజీ అత్తగారిల్లు ఇక్కడే..
- ఊహాగానాల వెల్లువ.. హాట్‌టాపిక్‌గా మారిన వ్యవహారం



సాక్షి ప్రతినిధి మహబూబ్‌నగర్: రాష్ట్రంలో సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ ఎపిసోడ్ రోజుకో మలుపు తిరుగుతోంది. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో చోటుచేసుకున్న ఈ వ్యవహారంపై తొలుత హైదరాబాద్ కేంద్రంగా విచారణ ప్రారంభం కాగా.. వరంగల్‌కు చేరింది. తాజాగా ఆ మరకలు మహబూబ్‌నగర్‌ను అంటుకోగా.. హాట్ టాపిక్‌గా మారింది. తన ఫోన్‌తో పాటు జిల్లాలోని అప్పటి విపక్ష నాయకులు, బడా వ్యాపారులు, రియల్టర్ల ఫోన్లు ట్యాపింగ్‌కు గురయ్యాయని.. ఇందులో ఓ మాజీ మంత్రితో పాటు పలువురు పోలీస్ అధికారుల ప్రమేయం ఉందని ఎమ్మెల్యే యెన్నం మంగళవారం డీజీపీకి ఫిర్యాదు చేయడం ప్రకంపనలు సృష్టిస్తోంది. సీఎం రేవంత్‌రెడ్డి ఉమ్మడి జిల్లాకు చెందిన వారు కావడం.. ఫోన్ ట్యాపింగ్‌కు సంబంధించి ఏ-1గా చేర్చిన ఇంటెలిజెన్స్ మాజీ ఐజీ ప్రభాకర్‌రావు అత్తగారు కూడా ఇక్కడే (కల్వకుర్తి నియోజకవర్గం వెల్దండ మండలం) కావడంతో ఊహాగానాలు వెల్లువెత్తుతున్నాయి.

ఎమ్మెల్యే యెన్నం ఫిర్యాదుతో..

ఇటీవల సార్వత్రిక ఎన్నికల సమయంలోనూ తన ఫోన్ ట్యాపింగ్‌కు గురైందని.. 2018–23 కాలంలో అప్పటి అధికార పార్టీ బీఆర్‌ఎస్ విధానాలను విమర్శించే వారు, ప్రతిపక్ష పార్టీలతో సంబంధం ఉన్న వారు, ప్రముఖ వ్యాపారవేత్తల మొబైల్ ఫోన్లను ట్యాప్ చేశారని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి మంగళవారం హైదరాబాద్‌లో డీజీపీ, సిట్ అధికారిని కలిసి ఫిర్యాదు చేయడం పాలమూరులో కలకలం రేపింది. హైదరాబాద్‌లో, మహబూబ్‌నగర్ పట్టణంలోని స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్యూరో (ఎస్‌ఐబీ)లో పనిచేస్తున్న కొంతమంది పోలీస్ అధికారులతో ఓ మాజీ మంత్రి కుమ్మక్కయ్యారని.. ఆయన సూచనలతో అనధికారికంగా ఫోన్లు ట్యాపింగ్ చేశారని పలు ఉదాహరణలతో వినతిపత్రం సమర్పించారు. ట్యాపింగ్‌తో సేకరించిన సమాచారం ఆధారంగా ఆ మాజీ మంత్రి, పోలీస్ అధికారులు బెదిరింపులు, బ్లాక్ మెయిలింగ్‌లకు పాల్పడ్డారని.. ఈ మేరకు విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా ప్రతి జిల్లాకు ఒక కంప్లైంట్ సెల్ ఏర్పాటు చేయాలని విన్నవించారు. ఈ నేపథ్యంలో సామాజిక మాధ్యమాల్లో చర్చ జోరుగా సాగుతోంది. సార్వత్రిక ఎన్నికల సమయంలో రాజకీయ నాయకులతో పాటు అధికారులు సైతం సాధారణ కాల్స్ స్వీకరించకపోయేవారని..'నార్మల్ కాల్ వద్దు.. వాట్సప్ కాల్ చేయండి' అంటూ సమాధానం చెప్పేవారని పలువురు గుర్తు చేసుకుంటున్నారు.



తన ఫోన్ ట్యాపింగ్‌పై డీజీపీకి ఫిర్యాదు చేసిన మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి


గతంలోనే ఆరోపణలు

2018లో 'ఎన్నికల అఫిడవిట్ ట్యాంపరింగ్' కేసులో.. 2022లో మంత్రి హత్యకు కుట్ర కేసు నమోదైన క్రమంలో పలువురి ఫోన్లు ట్యాపింగ్‌కు గురయ్యాయని అప్పట్లోనే ఆరోపణలు వెల్లువెత్తాయి. మహబూబ్‌నగర్‌లోని ఓ పోలీస్ స్టేషన్‌లో ఫోన్ ట్యాపింగ్ విభాగాలు ఏర్పాటు చేసి.. ఓ సీఐ ద్వారా ముఖ్య రాజకీయ నాయకులు, వారి అనుచరులు, బంధువుల ఫోన్ నంబర్లను ట్యాపింగ్ చేసినట్లు ప్రచారం జరిగింది. వీటిపై గత ప్రభుత్వ హయాంలోనే పలువురు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినట్లు సమాచారం. ఎవరూ పట్టించుకోకపోవడం.. పైగా వేధింపుల నేపథ్యంలో వారు మిన్నకుండిపోయినట్లు తెలుస్తోంది.

సీఎం రేవంత్‌రెడ్డి, ఆయన కుటుంబసభ్యులు టార్గెట్‌గా ఫోన్‌ట్యాపింగ్‌కు పాల్పడినట్లు విచారణలో బహిర్గతమైనట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో హైదరాబాద్‌లో ఆయన ఇంటికి సమీపంలోనే ఫోన్ ట్యాపింగ్ పరికరాలు ఏర్పాటు చేసి.. నిరంతర నిఘా పెట్టినట్లు పోలీసులు చెబుతున్నారు. ముఖ్యమంత్రి ఉమ్మడి మహబూబ్‌నగర్‌లోని కొడంగల్ నుంచి ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహిస్తున్న క్రమంలో ఈ జిల్లాలోనూ ట్యాపింగ్ వ్యవహారం నడిచిందని కాంగ్రెస్ నేతలు అంటున్నారు. మాజీ ఐజీ ప్రభాకర్‌రావు నేతృత్వంలో ఏర్పాటైన ఎస్‌ఐబీ (పొలిటికల్) వింగ్‌లో ఫోన్ల ట్యాపింగ్ వ్యవహారంలో కీలకంగా వ్యవహరించిన ఏ–2 నిందితుడు ప్రణీత్‌రావు ఇచ్చిన వివరాల ఆధారంగా తెలంగాణలో కేసు విచారణ జరుగుతున్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు ఉమ్మడి వరంగల్‌లోని ఓ జిల్లాలో వార్‌రూం ఏర్పాటు చేసి.. అక్కడి నుంచి అధికార, విపక్షనేతల ఫోన్ల ట్యాపింగ్‌కు చేసినట్లు ప్రచారం జరగగా.. జిల్లాలోని పలు ప్రాంతాల్లో ప్రత్యేక బృందాలు తనిఖీలు నిర్వహించాయి. తాజాగా ఎమ్మెల్యేనే ఫిర్యాదు చేసిన క్రమంలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోనూ సిట్ తనిఖీలు చేపట్టే అవకాశం ఉన్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

త్వరలో సిట్ తనిఖీలు ?

రేపు కేఎస్పీ 'ఆఖరు తడి' విడుదల



దేవరకద్ర: కోయిల్‌సాగర్ ప్రాజెక్టు నుంచి ఆఖరు తడి వదలడానికి అధికారులు సన్నద్ధమయ్యారు. ఇటీవల సాగు నీరందక చివరి ఆయకట్టు రైతులు ఆందోళన చేసిన విషయం తెలిసిందే. కాగా.. 5వ విడతలో చివరి తడి నీటిని గురువారం నుంచి విడుదల చేస్తున్నట్లు ప్రాజెక్టు ఈఈ ప్రతాప్‌సింగ్ తెలిపారు. ప్రస్తుతం ప్రాజెక్టులో 17.6 అడుగుల మేర నీటిమట్టం ఉండగా ఇందులో 0.3 టీఎంసీల నీటిని తాగునీటి అవసరాల కోసం నిల్వ చేసి మిగతా నీటిని పంటలకు వదలడానికి అధికారులు నిర్ణయించారు. అయితే ప్రస్తుతం ఉన్న నీటిలో ఆరు అడుగుల మేర నీటిని పంటలకు వదిలి మిగతా 12 అడుగుల మేర నీటిని నిల్వ చేసే అవకాశం ఉన్నట్లు తెలిసింది. చివరి తడితో యాసంగి పంటలు పూర్తయ్యే అవకాశం ఉంది. అయితే నీటిని వదిలిన తర్వాత చివరి ఆయకట్టుకు నీరు అందే వరకు విడుదల కొనసాగుతుందా.. అని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముందుగా చివరి ఆయకట్టుకు నీటిని అందించాలని రైతులు కోరుతున్నారు.

'పది' పరీక్షలకు 54 మంది గైర్హాజరు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లావ్యాప్తంగా పదో తరగతి పరీక్షలు మంగళవారం ప్రశాంతంగా జరిగాయి. ఈ మేరకు 59 పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులు సైన్స్ పార్ట్– 1 పరీక్ష రాశారు. పరీక్షకు మొత్తం 12,776 మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా.. 12,722 మంది హాజరవగా.. 54 మంది గైర్హాజరయ్యారు. ఈ సందర్భంగా డీఈఓ రవీందర్ జిల్లాలోని 7 పరీక్ష కేంద్రాలను ఏసీజీఈ 3, ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు 15 పరీక్ష కేంద్రాల్లో తనిఖీలు చేశారు.

ప్రతి ఒక్కరు ఓటుహక్కు వినియోగించుకోవాలి



జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్

మహబూబ్‌నగర్ న్యూటౌన్: ఓటరుగా నమోదైన ప్రతిఒక్కరు ఓటు హక్కు వినియోగించుకోవాలని అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్ అన్నారు. రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లాకేంద్రంలో స్వీప్ ఆధ్వర్యంలో మంగళవారం ఓటరు అవగాహన చైతన్య ర్యాలీ నిర్వహించారు. అంతకు ముందు జిల్లా మెయిన్ స్టేడియంలో అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్ జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ర్యాలీ బస్టాండ్, తెలంగాణ చౌరస్తా మీదుగా ప్రధాన వీధుల గుండా సాగింది. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు చాలా విలువైనదని, ప్రతి ఓటరు తమ హక్కును వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో ఓటింగ్ శాతం పెంచడానికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల్లో అందరూ భాగస్వాములు కావాలని కోరారు. ర్యాలీలో నినాదాలు చేస్తూ ముందుకు సాగారు. జిల్లా స్వీప్ కార్యక్రమాల నోడల్ అధికారి శ్రీధర్ సుమన్ మాట్లాడుతూ ఓటర్లలో చైతన్యం తీసుకురావడానికి రాష్ట్ర ఎన్నికలసంఘం పలు కార్యక్రమాలు రూపొందించిందన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ నవీన్, డీవైఎస్‌ఓ శ్రీనివాస్, డీపీఆర్‌ఓ పి.శ్రీనివాస్, ఎల్‌డీఎం భాస్కర్, విద్యా శాఖ అధికారులు, ఉద్యోగులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

తెలుగు సాహిత్యం ఎంతో గొప్పది



వర్క్‌షాప్‌ను జ్యోతి వెలిగించి ప్రారంభిస్తున్న డానియేల్ నేజర్స్

జడ్చర్ల టౌన్: తెలుగు సాహిత్యం ఎంతో గొప్పదని ప్యారిస్ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ డానియల్ నేజర్స్ అన్నారు. పట్టణంలోని బీఆర్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం తెలుగు, హిందీ, ఇంగ్లిష్, సంస్కృత భాషా శాఖల ఆధ్వర్యంలో సాహిత్యం– సంస్కృతి అనే అంశంపై నిర్వహించిన ఒకరోజు వర్క్‌షాప్‌లో ఆయన పాల్గొని ప్రసంగించారు. 40 ఏళ్లుగా తాను తెలుగు సాహిత్యం, సంస్కృతులపై అధ్యయనం చేస్తున్నానన్నారు. తాను పరిశోధిస్తున్న కొద్ది భాషపై ఇష్టం పెరుగుతుందన్నారు. తెలుగు పదాలు ఎంతో మధురంగా ఉన్నాయని, ఒక్కో మాట పలుకుతుంటే పంచభక్ష పరమాన్నం భుజించినట్లుగా ఉందన్నారు. తెలుగు భాష పదాలను ఉపయోగిస్తూ విద్యార్థుల్లో నూతనోత్తేజం నింపారు. కీలక వక్త ఆచార్య జయధీర్ తిరుమల్‌రావు మాట్లాడుతూ జానపద ఆదివాసి మూల ఆధారాలు ప్రాధాన్యత అనే అంశంపై తన పరిశోధనలు, వివిధ ప్రదేశాలను సందర్శించి తాళపత్రాలను, సంగీత వాయిద్యాలను సేకరించి మ్యూజియం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. భవిష్యత్ తరాలకు మన సంస్కృతిని అందించడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలను విద్యార్థులకు వివరించారు. ప్రత్యేక వక్త ఆచార్య గూడురు మనోజ్ మాట్లాడుతూ పునాది ఆధారాలు– వర్తమానం– భవిష్యత్ పరిరక్షణ– ఆవశ్యకత అనే అంశం గురించి మాట్లాడారు. భావితరానికి మన సంస్కృతి, సంప్రదాయాల ప్రాముఖ్యత, వాటి పరిరక్షణ ఆవశ్యకత గురించి వివరించాలన్నారు. కల్యాణి నర్సింహరావు హిందీ భాష చరిత్ర, ఇస్తావార్ దలా లిటరేచర్ హిందుస్తానీ అనే పుస్తకం గురించి అవగాహన కల్పించారు. పాలమూరు విశ్వవిద్యాలయం తెలుగు శాఖ అధ్యక్షురాలు సంధ్యారాణి మాట్లాడుతూ పీజీ కోర్సులు చదివి సమాజాన్ని ఉద్ధరించే కవులుగా, సామాజికవేత్తలుగా రాణించాలన్నారు. వర్క్‌షాప్‌లో కళాశాల ప్రిన్సిపాల్ అప్పియా చిన్నమ్మ, తెలుగు విభాగం అధిపతి సుభాషిణి పాల్గొన్నారు. మూలధ్వని అనే అంశంపై కళాశాల విద్యార్థులతో జిజ్ఞాస ప్రాజెక్టులో భాగంగా రాష్ట్రస్థాయి ద్వితీయ బహుమతి సాధించారని ప్రిన్సిపాల్ చెప్పారు.

ఇంగ్లిష్ సాహిత్యంపై మరిన్ని పరిశోధనలు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: ఇంగ్లిష్ సాహిత్యంపై మరిన్ని పరిశోధనలు జరగాల్సిన అవసరం ఉందని ఇఫ్లూ యూనివర్సిటీ అధ్యాపకులు రాజునాయక్ అన్నారు. మంగళవారం పాలమూరు యూనివర్సిటీలో ఇంగ్లిష్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో 'నాలుగో ప్రపంచ సాహిత్య' అనే అంశంపై నిర్వహించిన అంతర్జాతీయ వర్క్‌షాప్‌నకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. అనేక అంశాల్లో సాహిత్యాన్ని మరింత మెరుగుపర్చాలంటే నేటితరం యువ రీసెర్చ్ స్కాలర్స్ పరిశోధనలు చేయడం ద్వారా నేటి సమాజానికి ఇంగ్లిష్ వైభవాన్ని వివరించగలమన్నారు. రిటైర్డ్ అధ్యాపకులు మనోజ మాట్లాడుతూ నాలుగో ప్రపంచపు ఇంగ్లిష్ సాహిత్యం నేటికి దాని ప్రాధాన్యతను మరింత పెంచుకుందని, దాన్ని అర్థం చేసుకునేవారికి ఎంతో అనుభూతి ఇస్తుందని అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో అధ్యాపకులు జయధీర్ తిరుమలరావు, డేనియల్ నేజర్స్, ఇన్‌చార్జ్ రిజిస్ట్రార్ మధుసూదన్ రెడ్డి, ప్రిన్సిపాల్ చంద్రకిరణ్, కృష్ణయ్య, కంట్రోలర్ రాజ్‌కుమార్, ఎస్సీ, ఎస్టీ సెల్ డైరెక్టర్ కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.



వర్క్‌షాప్‌లో పాల్గొన్న అధ్యాపకులు, స్కాలర్స్

పోలింగ్‌కు ఏర్పాట్లు పూర్తిచేయాలి



అధికారులకు సూచనలు చేస్తున్న కలెక్టర్ రవినాయక్

మహబూబ్‌నగర్ న్యూటౌన్/ మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉప ఎన్నికకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రవి నాయక్ అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లాకేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. పోలింగ్ కేంద్రం వద్ద 100 మీటర్ల పరిధి మార్క్ చేసి బారికేడింగ్ ఏర్పాటు చేయాలని, పోలింగ్ కేంద్రంలో అవసరమైన ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, జెడ్పీ సీఈఓ రాఘవేంద్రరావు, ఆర్డీఓ నవీన్ తదితరులున్నారు.

48 గంటల 'నిశ్శబ్ద సమయం'

ఉప ఎన్నికల పోలింగ్ నేపథ్యంలో జిల్లావ్యాప్తంగా 48 గంటల పాటు నిశ్శబ్ద సమయం (సైలెన్స్ పీరియడ్) పాటించాలని కలెక్టర్ రవినాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం సాయంత్రం 4 నుంచి గురువారం సాయంత్రం 4 గంటల వరకు ఇది అమలులో ఉంటుందన్నారు. ఈ సమయంలో అన్ని రకాల ఎన్నికల ప్రచారం నిషేధించామన్నారు. రాజకీయ నాయకులు ఎట్టి పరిస్థితుల్లోనూ బహిరంగ సభలు నిర్వహించొద్దని, ఎలాంటి ప్రసంగాలు, హోటళ్లు, వివిధ హాళ్లలో కలవడం, సంగీత కచేరీల ఏర్పాటు, పబ్లిక్ లేదా ప్రైవేట్ ప్రదేశాల్లో ముఖ్యంగా పోలింగ్ ప్రాంతంలో మద్యం అమ్మకం, పంపిణీ వంటివి చేయవద్దన్నారు. ఒపీనియన్, ఎగ్జిట్ పోల్ లేదా మరేదైనా సర్వే ఫలితాలతో సహా ఎలక్ట్రానిక్ మీడియా, ఇతర మాధ్యమాల్లో ప్రచురించడానికి, ప్రసారం చేయడానికి వీలులేదన్నారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

మొదటి ర్యాండమైజేషన్ పూర్తి

లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో మొదటి ర్యాండమైజేషన్ నిర్వహించి పీఓ, ఏపీఓ, ఓపీఓలను నియమించారు. మంగళవారం కలెక్టర్ రవినాయక్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో ప్రత్యేక సాఫ్ట్‌వేర్ ద్వారా జిల్లాకు పోలింగ్ సిబ్బంది నియామకం కోసం మొదటి ర్యాండమైజేషన్ నిర్వహించి అవసరమైన సంఖ్యలో రిజర్వుతో పీఓ, ఏపీఓ, ఇద్దరు ఓపీఓలతో పోలింగ్ సిబ్బందిని నియమించి ఉత్తర్వులు జారీచేశారు. ఎన్నికల విధులు కేటాయిస్తూ జారీ చేసిన ఉత్తర్వులు స్వీకరించడానికి నిరాకరించిన, ఎన్నికల విధుల్లో భాగంగా శిక్షణకు హాజరుకాకపోయినా ఎన్నికల నిబంధనలను అనుసరించి చర్యలు తీసుకుంటామన్నారు.



కమనీయం.. అలివేలుమంగ రథోత్సవం

మన్యంకొండ అలివేలు మంగతాయారు రథోత్సవం మంగళవారం అశేష జనవాహిని మధ్య అత్యంత వైభవంగా జరిగింది. ఉమ్మడి జిల్లా నలుమూలల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారి రథాన్ని లాగి భక్తి పారవశ్యంతో పులకించిపోయారు.

- వివరాలు 8లో..

సోనామసూరి ధర రూ.2,331

దేవరకద్ర: పట్టణంలోని మార్కెట్ యార్డులో మంగళవారం నిర్వహించిన టెండర్లలో సోనామసూరి ధాన్యం క్వింటాల్‌కు గరిష్ఠంగా రూ.2,331, కనిష్ఠంగా రూ.2,229 ధరలు నమోదయ్యాయి. అలాగే హంస ధాన్యం గరిష్ఠంగా రూ.1,998, శ్రీరామ్ గోల్డ్ సరాసరిగా రూ.2,331, ఆముదాలు సరాసరిగా రూ.5,725 ధర వచ్చాయి. మార్కెట్‌లో మంగళవారం లావాదేవీలు పుంజుకున్నాయి.

నేడు ఉల్లి వేలం..

దేవరకద్ర మార్కెట్‌లో బుధవారం ఉల్లి వేలం నిర్వహిస్తారు. ఉల్లి సీజన్ కావడం వల్ల చుట్టుపక్కల మండలాల నుంచి పెద్దఎత్తున ఉల్లి అమ్మకానికి వచ్చే అవకాశం ఉంది. సీజన్ ప్రారంభం నుంచి ఉల్లి ధరలు వారం వారం కొంత తగ్గుతున్నాయి. ఈ వారం ధరలు ఏవిధంగా వస్తాయో వేచి చూడాలి.

అన్నివర్గాల అభ్యున్నతే ధ్యేయం



మాట్లాడుతున్న ఎంపీ అభ్యర్థి డీకే అరుణ

పాలమూరు: ట్రిపుల్ తలాక్ రద్దుతో మైనార్టీ మహిళల కష్టాలు, బాధలు తీర్చింది బీజేపీ అని మహబూబ్‌నగర్ ఎంపీ అభ్యర్థి డీకే అరుణ అన్నారు. జిల్లాకేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో మంగళవారం మైనార్టీ మహిళల ఆత్మీయ సమ్మేళనంలో ఆమె పాల్గొన్ని మాట్లాడారు. అన్నివర్గాల అభ్యున్నతి కోసం మోదీ ప్రభుత్వ పాలన సాగుతోందన్నారు. ఇక్కడి నుంచి గెలిచిన ఎంపీలు ఏ రోజు కూడా ప్రజల సమస్యలు పట్టించుకోలేదన్నారు. ప్రపంచంలోని చాలా దేశాలు మోదీ పాలన చూసి ఆశ్చర్యపోయి ఆదర్శంగా తీసుకుంటున్నాయని చెప్పారు. దేశం అభివృద్ధి చెందాలన్నా.. పాలమూరు అభివృద్ధి జరగాలన్నా బీజేపీ అభ్యర్థిని గెలిపించాల్సిన అవసరం ఉందన్నారు. అరచేతిని అడ్డుపెట్టి సూర్యకాంతిని, కుట్రలు చేసి మోదీని ప్రధాని కాకుండా ఎవరూ ఆపలేరన్నారు. ఈ ప్రాంత బిడ్డగా అభివృద్ధి చేయాలనే తపన ఉందని, రాబోయే ఎన్నికల్లో గెలిపిస్తే తప్పక అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు.

క్లుప్తంగా

ప్రమాదవశాత్తు కోనేరులో పడి మహిళ మృతి


బాలమణి

హన్వాడ: మండల పరిధిలోని మాదారం గ్రామ శివారులోని ర్యాకమకొండపై ఉన్న కోనేరులో ఓ మహిళ చిక్కుకుని మృత్యువాత పడిన సంఘటన మంగళవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. పోలీసులకు కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధిలోని బుద్దారానికి చెందిన పానగంటి బాలమణి(45) కుటుంబ సభ్యులతో కలిసి సోమవారం రాత్రి ర్యాకమకొండపై కొనసాగుతున్న తిరుమలనాథ బ్రహ్మోత్సవాలకు వెళ్లింది. రథోత్సవం అనంతరం కుటుంబ సభ్యులతో కలిసి మంగళవారం తెల్లవారుజామున అక్కడే ఉన్న కోనేటిలో స్నానానికి వెళ్లింది. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు బాలమణి కోనేటిలో కాలుజారి పడిపోయింది. తేరుకున్న కుటుంబ సభ్యులు ఆమెను బయటకి తీశారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి శవ పంచనామా నిర్వహించి శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా జనరల్ ఆస్పత్రికి తరలించారు. మృతురాలి భర్త కృష్ణయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ వెంకటేష్ తెలియజేశారు.

ఫుడ్‌పాయిజన్‌తో లక్నోలో జడ్చర్లకు చెందిన వృద్ధురాలి మృతి


భారతిరాంరెడ్డి(ఫైల్)

జడ్చర్ల టౌన్: ఉత్తరప్రదేశ్, లక్నోలో జడ్చర్లకు చెందిన భారతిరాంరెడ్డి(68) ఫుడ్‌పాయిజన్‌తో మృతిచెందింది. భర్త డా.రాంరెడ్డి, ఇద్దరు మనవళ్లతో కలిసి అయోధ్య బాలరాముడి దర్శనార్థం సోమవారం ఉదయం ఫ్లైట్‌లో లక్నోకు వెళ్లారు. మంగళవారం బాలరాముడి దర్శనం చేసుకోవాల్సి ఉండగా.. సోమవారం అక్కడ సమీపంలోని దేవాలయాన్ని సందర్శించి రాత్రి 8 గంటలకు లక్నోలోని ఓ లాడ్జ్‌లో బసచేశారు. అక్కడే రాత్రి భోజనం ముగించిన కొద్ది సేపటికే వాంతులు, విరేచనాలు అయ్యాయి. దీంతో సమీపంలోని ఆస్పత్రిలో చికిత్స అందించారు. చికిత్సతో కోలుకోవటంతో రాత్రి 12 గంటలకు తిరిగి లాడ్జ్‌కు చేరుకున్నారు. అయితే వాంతులు, విరేచనాలు అధికమై డీహైడ్రేషన్‌కు గురై లాడ్జ్‌లోనే మృతిచెందింది. మృతురాలు పోలీస్‌శాఖలో ఫోరెన్సిక్ విభాగంలో పనిచేసి రిటైర్డ్ అయ్యారు. విజయ ఇన్‌స్టిట్యూట్ పేరుతో నర్సింగ్ కళాశాల నిర్వహిస్తూ.. పలువురికి శిక్షణ ఇస్తుంది. ఆర్య సమాజం సభ్యురాలిగా ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటారు. వీటితో పాటు పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తుంది. మృతురాలి భర్త డా.రాంరెడ్డి ప్రజలందరికి సుపరిచితుడు. అనేక ఏళ్లుగా ఆయన వైద్యుడిగా ప్రజలకు సేవలు అందిస్తున్నాడు. కాగా మంగళవారం పోస్టుమార్టం ప్రక్రియ ఆలస్యం కావటంతో మృతదేహం బుధవారం ఫ్లైట్‌లో తీసుకురానున్నారు. మృతురాలికి ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు.

మైనర్‌ను పెళ్లి చేసుకున్న వ్యక్తిపై కేసు నమోదు

తెలకపల్లి: మైనర్‌ను నమ్మించి మోసం పెళ్లి చేసుకున్న వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నరేష్ తెలిపారు. ఎస్ఐ వివరాల ప్రకారం.. మండలంలోని ఓ గ్రామానికి చెందిన 14 ఏళ్ల బాలిక, పెద్దకొత్తపల్లి మండలం ముష్టిపల్లికి చెందిన మొల్లకుంట సలేశ్వరం (22) నాలుగు నెలలుగా ప్రేమించుకున్నారు. ఈ నెల 22న బాలిక ఇంట్లో ఎవరూ లేని సమయంలో తాళి కట్టి కులాంతర వివాహం చేసుకున్నాడు. మంగళవారం ఈ విషయం తెలుసుకున్న బాలిక తల్లి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఆమె ఫిర్యాదు మేరకు సలేశ్వరంపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

వీరంరాజ్‌పల్లిలో ఈతతోట దగ్ధం



బల్మూర్: మండలంలోని వీరంరాజ్‌పల్లి శివారులోని ఓ గీతా కార్మికుడు పెంచుతున్న ఈతతోట మంగళవారం దగ్ధమైన ఘటన చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన ఐల శంకర్‌గౌడ్ మూడేళ్లుగా తన రెండు ఎకరాల పొలంలో 350 ఈత మొక్కలను పెంచుతున్నాడు. మంగళవారం తోట దగ్గర ఎవరూ లేని సమయంలో నిప్పంటుకొని చెట్లన్నీ కాలి బూడిదయ్యాయి. తోట విలువ సుమారు ఐదు లక్షల వరకు ఉంటుందని బాధితుడు పేర్కొన్నాడు. గిట్టని వారే తన తోటను నిప్పంటించి కాల్చివేశారని బాధితుడు ఆరోపించాడు. ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు బాధితుడు తెలిపాడు.

కమనీయం.. అలివేలుమంగ రథోత్సవం


గరుడ వాహనంపై ఊరేగుతున్న ఉత్సవమూర్తులు


రథం లాగుతున్న భక్తులు

మహబూబ్‌నగర్ రూరల్: మన్యంకొండ అలివేలు మంగతాయారు ఉత్సవాల్లో భాగంగా సోమవారం అర్ధరాత్రి రథోత్సవం (విమాన రథోత్సవం) అంగరంగ వైభవంగా జరిగింది. ముందుగా శోభాయమానంగా అలంకరించిన గరుడ వాహనంపై స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను ఉంచి గరుడ సేవ నిర్వహించారు. గర్భాలయం నుంచి మేళవాయిద్యాలు, పురోహితుల వేద మంత్రోచ్చారణల నడుమ ప్రధాన ద్వారం నుంచి దేవస్థానం ఆవరణలోని రథం వద్దకు ఊరేగింపుగా తీసుకొచ్చారు. అనంతరం రథం ముందు కుంభం పోసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం రంగురంగుల పూలు, మామిడి తోరణాలతో ముస్తాబు చేసిన రథంపై ఉత్సవ విగ్రహాలను ఉంచి పూజలు నిర్వహించారు. భక్తుల హరినామస్మరణ మధ్య రథం ముందుకు కదిలింది. ఉమ్మడి జిల్లా నలుమూలల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారి రథాన్ని లాగి భక్తి పారవశ్యంతో పులకించిపోయారు. దేవగుండు వరకు రథాన్ని తీసుకెళ్లి తిరిగి ఆలయం వద్దకు తీసుకొచ్చారు. కాగడాలు, విద్యుద్దీపాల వెలుతురులో బంగారు ఆభరణాలు ధరించిన స్వామి, అమ్మవార్లు మెరిసిపోతూ భక్తులకు దర్శనమిచ్చారు. రథోత్సవం ముగిసిన తర్వాత ఉత్సవ విగ్రహాలను గరుడ వాహనంపై గర్భగుడికి తీసుకొచ్చారు. ఆలయం చుట్టూ ప్రదక్షిణలు నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. అలాగే ప్రత్యేక అభిషేకం, బలిహరణం, హోమం తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

ఘనంగా అశ్వవాహన సేవ..

అలివేలు మంగతాయారు దేవస్థానంలో మంగళవారం రాత్రి అమ్మవారి అశ్వవాహన సేవ ఘనంగా నిర్వహించారు. అందంగా అలంకరించిన అశ్వవాహనంపై స్వామి, అమ్మవార్లను ఉంచి గర్భగుడి నుంచి దేవస్థానం ముందున్న మండపం వరకు ఊరేగించారు. విశేష దినోత్సవం సందర్భంగా గుట్ట పైనున్న లక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద భక్తుల రద్దీ కనిపించింది. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ అళహరి మధుసూదన్‌కుమార్, ఈఓ శ్రీనివాసరాజు, సూపరింటెండెంట్ నిత్యానందాచారి, ఉత్సవ కమిటీ సభ్యులు, అర్చకులు పాల్గొన్నారు.



నేడు వసంతోత్సవం..

ఉత్సవాల్లో భాగంగా బుధవారం వసంతోత్సవం నిర్వహించనున్నారు. అలాగే పూర్ణాహుతి, అవభృతస్నానం, రాత్రికి నాకబలి (నాగవెల్లి), ద్వాదశ ఆరాధన, సప్తావరణాలు, మహదాశీర్వచనం కార్యక్రమాలు జరగనున్నాయి. దీంతో అమ్మవారి ఉత్సవాలు ముగుస్తాయి.

కందూరులో ముగిసిన బ్రహ్మోత్సవాలు

- చివరిరోజు కోనేరులో స్వామివారికి త్రిశూల స్నానం
- నేటినుంచి మొదలవనున్న జాతర
- ఆలయ ఆవరణలో వెలసిన దుకాణాలు


కోనేరులో త్రిశూల స్నానం చేయిస్తున్న పండితులు

అడ్డాకుల: దక్షిణకాశీగా వెలుగొందుతూ కందూర్‌లో స్వయంభూగా వెలసిన శ్రీరామలింగేశ్వర స్వామి ఆలయం వద్ద స్వామివారి బ్రహ్మోత్సవాలు మంగళవారం ముగిశాయి. చివరిరోజు ప్రధాన ఆలయంలోని శివలింగానికి అభిషేకం, స్వామివారి వెండి ముఖాన్ని పూలతో అలంకరించి పూజలు చేశారు. గౌరమ్మ ఆలయంలో గౌరమ్మ విగ్రహానికి చీర, పూలతో అలంకరించి పూజలు జరిపారు. రుద్రాభిషేకం, రుద్రహోమం తర్వాత మహాపూర్ణాహుతి చేపట్టారు. స్వామివారి ఉత్సవ విగ్రహాలను పల్లకీలో ఉంచి ఆలయం ముందు ఊరేగించి కుంభాభిషేకం నిర్వహించారు. కందూర్‌లో వసంతోత్సవం నిర్వహించిన తర్వాత గ్రామస్తులు ఆలయానికి వచ్చి త్రిశూలస్నానం కార్యక్రమంలో పాల్గొన్నారు. పవిత్రమైన కల్పవృక్షాలు కోనేరు చుట్టూ ఆవహించి ఉంటడంతో వాటి ఆకులు రాలి కోనేరులోనే పడతాయి. అటువంటి పవిత్రమైన కోనేరులో స్వామివారి ఉత్సవ విగ్రహాలకు త్రిశూల స్నానం చేయించి ఉత్సవాలను ముగించారు. రామలింగేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ముగియడంతో బుధవారం నుంచి జాతర ప్రారంభం కానుంది. ఇప్పటికే ఆలయ పరిసరాల్లో దుకాణాలు వెలిశాయి. ప్రతి ఏటా బ్రహ్మోత్సవాలు ముగిసిన తర్వాత ఉగాది వరకు జాతర కొనసాగేది. అయితే ఈసారి కూడా జాతరను శ్రీరామ నవమి వరకు పొడిగించారు. కార్యక్రమంలో ఈఓ రాజేశ్వరశర్మ, జూనియర్ అసిస్టెంట్ అనంతసేన్‌రావు, గ్రామస్తులు రవీందర్‌శర్మ, దామోదర్‌రెడ్డి, రాములు, బుచ్చన్నగౌడ్, దేవన్నయాదవ్, మనోహర్, సత్తిరెడ్డి, డబ్బ అంజి, అర్చకులు తదితరులు పాల్గొన్నారు.


ఆలయం వద్ద రంగులు చల్లుకుంటున్న గ్రామస్తులు

నమో.. నారసింహా..


మామిళ్లపల్లి ఆలయం వద్ద రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

ఉప్పునుంతల: మండలంలోని మామిళ్లపల్లిలో కొనసాగుతున్న శ్రీలక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం తెల్లవారుజామున ఆలయ ఆవరణలో భక్తులు రథోత్సవాన్ని అట్టహాసంగా నిర్వహించారు. అనంతరం ఉదయం స్వామివారికి ప్రత్యేక పూజలు, నిత్యహోమాలు, బలిహరణం, తీర్థప్రసాద వితరణ కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా సాయంత్రం ఆలయ ఆవరణలో కోలాటాల పోటీలు నిర్వహించి విజేతలకు నగదు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ రాజల్‌రావు, ఈఓ శ్రీనివాసరావు, గణేష్‌గౌడ్, మోహన్‌గౌడ్, సుదర్శన్, శేఖర్, సైదులు తదితరులు భక్తులు పాల్గొన్నారు.

■ బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈ నెల 27న బుధవారం మధ్యాహ్నం ట్రాక్టర్ రివర్స్ పోటీలు నిర్వహించనున్నట్లు ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ రాజల్‌రావు, ఈఓ శ్రీనివాసరావు తెలియజేశారు.

ముగిసిన రంగనాథస్వామి బ్రహ్మోత్సవాలు



పెబ్బేరు రూరల్: శ్రీరంగాపురం మండల కేంద్రంలో శ్రీ రంగనాథ స్వామి బ్రహ్మోత్సవాలు మంగళవారం ముగిశాయని ప్రధాన అర్చకులు విష్ణునారాయణ తెలిపారు. చివరిరోజు ఉదయం వేద పండితుల వేద మంత్రోచ్ఛారణలతో గర్భగుడిలో శ్రీదేవి, భూదేవి సమేతంగా రంగనాథస్వామిని అలంకరించి ప్రత్యేక పూజలు, హోమం నిర్వహించి పూర్ణాహుతి సమర్పించారు. రాత్రి ఆవబృతం, ధ్వజావరోహణ, తీర్థప్రసాద వితరణ, నాగవలి కార్యక్రమాలు నిర్వహించారు.అర్చకులు గోవిందాచార్యులు, సురేశాచార్యులు, కన్నయ్యస్వామి, బద్రీనాథ్‌ఆచార్య, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

మద్దిమడుగు అంజన్న హుండీ రూ.16.09 లక్షలు

అమ్రాబాద్: పదర మండలం మద్దిమడుగు పబ్బతి శ్రీఆంజనేయస్వామి హుండీ ఆదాయాన్ని మంగళవారం మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు ఆలయ ప్రాంగణంలో లెక్కించారు. మూడు నెలలకు సంబంధించిన మొత్తం హుండీ ఆదాయం రూ.16,09,351 నగదు వచ్చినట్లు ఆలయ అధికారులు తెలిపారు. అలాగే మిశ్రమ వెండి 1,650 గ్రాములు వచ్చింది. అనంతరం నగదును పదర ఏపీజీవీబీ ఖాతాలో జమ చేసినట్లు ఆలయ అధికారులు తెలిపారు. కార్యక్రమంలో దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వరమ్మ, కార్య నిర్వహణ అధికారి రంగాచారి, జైపాల్‌రెడ్డి, జంగయ్య, అజయ్, ఆలయ ప్రధాన అర్చకుడు వీరయ్యశర్మ తదితరులు పాల్గొన్నారు.

ఊర్కొండపేటలో రూ.7.94 లక్షలు..

ఊర్కొండ: మండలంలోని ఊర్కొండపేట అభయాంజనేయస్వామి ఆలయంలో హుండీ లెక్కింపును మంగళవారం దేవాదాయ, ధర్మాదాయ శాఖ అధికారుల ఆధ్వర్యంలో నిర్వహించారు. మూడు నెలల 15 రోజులకు గాను హుండీ ద్వారా రూ.7,94,344 ఆదాయం వచ్చిందని ఆలయ ఈఓ సత్యచంద్రారెడ్డి చెప్పారు. కార్యక్రమంలో సిర్సనగండ్ల ఈఓ రఘు, ఆలయ మాజీ ఉత్సవ కమిటీ సభ్యులు, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.


మద్దిమడుగులో హుండీ డబ్బులు లెక్కిస్తున్న సిబ్బంది


ఊర్కొండపేటలో హుండీ డబ్బులు లెక్కిస్తున్న సిబ్బంది

క్యాంపు రాజకీయాలు చేయడం సిగ్గుచేటు

- ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిదే విజయం
- టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఎస్.వినోద్‌కుమార్


మాట్లాడుతున్న టీపీసీసీ ప్రధాన కార్యదర్శి వినోద్‌కుమార్

స్టేషన్ మహబూబ్‌నగర్: స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలుపొందడానికి బీఆర్ఎస్ క్యాంపు రాజకీయాలు చేయడం, ఇందులో కేటీఆర్, మాజీ మంత్రులు, ప్రజాప్రతినిధులు పాల్గొనడం సిగ్గుచేటని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఎస్.వినోద్‌కుమార్ విమర్శించారు. జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. స్థానిక సంస్థలను అస్తవ్యస్తం చేసింది గత బీఆర్ఎస్ ప్రభుత్వమని, ఎంపీటీసీలకు కనీసం కుర్చీ కూడా కేటాయించకుండా వారిని అగౌరవపరిచిందన్నారు. స్థానిక సంస్థలకు బలోపేతం చేయాల్సిన ప్రభుత్వం దానిని విస్మరించిందని ఆరోపించారు. స్థానిక సంస్థల ప్రతినిధులు చేసిన పనులకు బిల్లులు రాక ఆర్థికంగా ఎంతో ఇబ్బందులు ఎదుర్కొన్నారని, కొంతమంది ఆత్మహత్యలు చేసుకున్న సంఘటనలు ఇంకా మరిచిపోలేదన్నారు. బీఆర్ఎస్ క్యాంపు రాజకీయాలకు తెరలేపడం సరికాదన్నారు. ఏముఖం పెట్టుకొని కేటీఆర్, మాజీ మంత్రులు స్థానిక సంస్థల ప్రతినిధులకు ఓట్లు అడుగుతున్నారని ప్రశ్నించారు. ఎంతో సౌమ్యుడు, మచ్చలేని మనిషి కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి మన్నె జీవన్‌రెడ్డిని స్థానిక సంస్థల ప్రతినిధులు మద్దతు తెలిపి భారీ మెజారీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో జిల్లా మీడియాసెల్ కన్వీనర్ సీజే బెనహర్, నాయకులు సిరాజ్‌ఖాద్రీ, లక్ష్మణ్‌యాదవ్, మల్లు నర్సింహారెడ్డి పాల్గొన్నారు.

అనారోగ్యంతో తండ్రి మృతి

పది పరీక్ష రాసి అంత్యక్రియలకు హాజరైన కుమార్తె


పరీక్ష కేంద్రం వద్ద పావని

చారకొండ: తండ్రి మృతిచెందగా.. ఆ బాధను దిగమింగుకొని పదో తరగతి పరీక్ష రాసి అంత్యక్రియల్లో పాల్గొంది ఓ విద్యార్థిని. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని జూపల్లికి చెందిన కడారి తిరుపతయ్య యాదవ్ (40) చికిత్స పొందుతూ సోమవారం మధ్యాహ్నం మృతిచెందాడు. కుమార్తె పావని పదోతరగతి పరీక్షలు రాస్తుంది. మంగళవారం మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రంలో భౌతికశాస్త్రం పరీక్ష రాసి అంత్యక్రియల్లో పాల్గొంది.

అధికారుల సమన్వయ లోపం

- ఒకే పాఠశాలలో పరీక్ష కేంద్రం, పోలింగ్ కేంద్రం
- పది విద్యార్థులకు తప్పని పాట్లు


అచ్చంపేటలోని జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల

అచ్చంపేట రూరల్: ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉప ఎన్నిక ఈ నెల 28న గురువారం జరగనుంది. ఉమ్మడి జిల్లాలోని నియోజకవర్గ కేంద్రాల్లో పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. అచ్చంపేటలోని జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. కాగా అదే పాఠశాలలో పది పరీక్షలు కొనసాగుతున్నాయి. 28న పది విద్యార్థులకు జీవశాస్త్రం పరీక్ష నిర్వహించనున్నారు. 240 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నారు. అదే పాఠశాలలోనే ఏర్పాటుచేసిన పోలింగ్ కేంద్రంలో 72 మంది ప్రజాప్రతినిధులు తమ ఓటును వినియోగించుకోనున్నారు. ఎమ్మెల్సీ పోలింగ్ ఉదయం 8 నుంచి సాయంత్రం 4 వరకు కొనసాగుతుండగా, పది పరీక్ష ఉదయం 9.30 నుంచి 11 వరకు కొనసాగనుంది. పాఠశాలలోని పరీక్ష కేంద్రం, పోలింగ్ కేంద్రానికి ఒకే ప్రవేశ ద్వారం ఉంది. దీంతో పది విద్యార్థులకు ఇబ్బందులు కలిగేలా ఉన్నాయి. రెవెన్యూ, విద్యాశాఖ అధికారుల సమన్వయ లోపంతోనే ఇలా జరుగుతుందని విద్యార్థుల తల్లిదండ్రులు అంటున్నారు. ఈ విషయాన్ని ఆర్డీఓ మాధవి వద్ద ప్రస్తావించగా.. విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా అటు పరీక్షలు, ఇటు ఎమ్మెల్సీ ఎన్నికలు నిర్వహిస్తామన్నారు. పాఠశాల పరిసరాల్లో 144 సెక్షన్ అమలులో ఉంటుందని.. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకుంటామని చెప్పారు. పరీక్ష కేంద్రం, పోలింగ్ కేంద్రం దూరంగా ఉండేలా ఏర్పాట్లు చేశామన్నారు.

ఘర్షణకు దారి తీసిని షార్ట్‌ఫిల్మ్ షూటింగ్

ఎస్టీ బాలుర వసతిగృహంలో ఘటన


లింగాల: షార్ట్‌ఫిల్మ్ షూటింగ్ వివాదాస్పదంగా మారి, చివరకు ఘర్షణకు దారి తీసిన ఘటన సోమవారం రాత్రి మండల కేంద్రంలోని ఎస్టీ బాలుర వసతిగృహంలో చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. ఎస్టీ బాలుర వసతిగృహం పాత పోలీస్‌స్టేషన్‌లో కొనసాగుతుంది. అందులో కొన్ని సన్నివేశాలు షార్ట్‌ఫిల్మ్‌కు ఉపయోగకరంగా ఉండటంతో నిర్వాహకులు అక్కడ షూటింగ్ తీసేందుకు నిర్ణయించారు. కాగా రాత్రి 9 గంటల సమయంలో వసతిగృహంలోని జైల్ గదుల వద్ద షూటింగ్ నిర్వహిస్తున్న సమయంలో కొంత మంది జైలు ఫొటోలు తీస్తున్నారు. ఫొటోలు తీయడాన్ని వసతి గృహానికి చెందిన ఓ వర్కర్ అభ్యంతరం తెలియజేయడం.. వివాదానికి దారి తీసింది. బయటి వ్యక్తులు వచ్చి వర్కరును చితకబాదారు. కొంత మంది అడ్డు తగిలి వారించడంతో సమస్య సద్దుమణిగింది. కాగా ఈ సంఘటనపై హెచ్‌డబ్ల్యూఓ తిర్పతయ్య వివరణ ఇచ్చారు. వసతిగృహంలో ఘర్షణ జరగడం వాస్తవమేనని, ఇది దురదృష్టకరమని అన్నారు. షార్ట్‌ఫిల్మ్ కోసం వసతిగృహంలో కొన్ని సన్నివేశాలు షూటింగ్ చేస్తామని కొన్ని రోజుల నుంచి కోరారని, అందుకు అనుమతి ఇచ్చామని తెలిపారు. కాగా ఇలాంటి సంఘటన చోటు చేసుకుంటుందని ఊహించలేదని, దీనిపై విచారణ జరుపుతామన్నారు. ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లామని చెప్పారు. తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలయజేశారు.

శ్రీశ్రీ కళావేదిక జాతీయ కార్యదర్శిగా అరుణ్‌కుమార్



నాగర్‌కర్నూల్: జిల్లాకేంద్రానికి చెందిన ఫిజిక్స్ ఫ్యాకల్టీ, కవి, రచయిత ఫిజిక్స్ అరుణ్‌కుమార్‌ను ఐఎస్‌ఓ గుర్తింపు పొందిన అంతర్జాతీయ సాహిత్య సాంస్కృతిక సామాజిక సేవా సంస్థ శ్రీశ్రీ కళావేదిక జాతీయ కార్యదర్శిగా నియమిస్తూ చైర్మన్ డాక్టర్ కత్తి మండ ప్రతాప్ నియామక పత్రం ఆన్‌లైన్ ద్వారా మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ఫిజిక్స్ అరుణ్ మాట్లాడుతూ నల్లమల ప్రాంతానికి చెందిన తనను రచయితగా రాష్ట్రస్థాయిలో పత్రికల్లో రాసే విధంగా తన ప్రతిభను ప్రోత్సహించిన ప్రతాప్‌కు అరుణ్ కృతజ్ఞతలు తెలిపారు. సామాజిక స్పృహతో శాస్త్రీయ వైఖరి పెంపొందించేలా, దేశభక్తి విద్యార్థుల్లో నింపేలా అందరికీ అర్థమయ్యే భాషలో రవీంద్రనాథ్ ఠాగూర్, శ్రీశ్రీ, తిలక్, కాళోజీ, కలేకూరి ప్రసాద్, అలిశెట్టి ప్రభాకర్ వంటి మహాకవుల స్ఫూర్తితో బాధ్యతగా రాస్తానన్నారు. తనకు ఈ అవకాశం ఏడాదిపాటు ఉంటుందన్నారు. జాతీయ కన్వీనర్ కొల్లి రమావతి, ఈశ్వరీ భూషణం, డాక్టర్ పార్థసారథి, లలిత చిట్టే, నూక సంపత్ తదితరులకు అరుణ్ కృతజ్ఞతలు తెలిపారు.

విద్యుదాఘాతంతో వలస కార్మికుడి మృతి


పరుశురాం మృతదేహం

మక్తల్: ఇటుక బట్టీలో పనిచేసేందుకు ఒడిశా నుంచి వచ్చిన ఓ యువకుడు విద్యుదాఘాతానికి గురై మృతిచెందాడు. అతడి మృతదేహాన్ని గుట్టుగా స్వరాష్ట్రానికి తరలించేందుకు ఇటుక బట్టీల నిర్వాహకులు యత్నించగా.. తోటి కార్మికులు, స్థానికులు అడ్డుకున్నారు. ఈఘటన మక్తల్ పట్టణంలో మంగళవారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. మక్తల్ సమీపంలో హరుణ్, రవినాయక్, మరికొందరు ఇటుక బట్టీలను ఏర్పాటుచేశారు. ఇటుకల తయారీకిగాను ఒడిశా రాష్ట్రం నూపడ జిల్లా మజుగాన్‌కు చెందిన పరుశురాం (17)తో పాటు మరికొందరు కార్మికులను ఇక్కడికి తీసుకొచ్చారు. ఇటుక బట్టీలో రోజు మాదిరిగానే పనులను పూర్తిచేసుకున్న పరుశురాం.. అక్కడే ఉన్న తన రూం వద్దకు వెళ్తున్న క్రమంలో కిందపడిన విద్యుత్‌వైరును గమనించకుండా తగలడంతో షాక్‌కు గురయ్యాడు. గమనించిన తోటి కార్మికులు చికిత్స నిమిత్తం అతడిని స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా.. అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. విషయం తెలుసుకున్న ఇటుక బట్టీల నిర్వాహకులు ఆస్పత్రి వద్దకు చేరుకుని, మృతదేహాన్ని గుట్టుగా ఒడిశాకు తరలించేందుకు యత్నించారు. దీనిపై అక్కడే ఉన్న తోటి కార్మికులు, స్థానికులు వారితో వాగ్వాదానికి దిగారు. ఈక్రమంలో కార్మికుడి మృతదేహాన్ని మహబూబ్‌నగర్ ఆస్పత్రికి తరలిస్తామని కొత్త వాదన చేయడంతో పలువురు ఆగ్రహం వ్యక్తంచేశారు. మృతదేహం తరలింపును అడ్డుకోవడంతో స్థానిక మార్చురీకి తరలించి, అక్కడి నుంచి వెళ్లిపోయారు.

అబ్దుల్ కలీం ఆజాద్‌కు యువ పురస్కారం

నేడు హైదరాబాద్‌లో ప్రదానం


అబ్దుల్ కలీం ఆజాద్

చిన్నచింతకుంట: హైదరాబాద్ పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం నాటక రంగంలో విశిష్ట సేవలు అందించిన పలువురికి 2023–24 పురస్కారాలను ప్రకటించింది. మండలంలోని అప్పంపల్లికి చెందిన ఎండి అబ్దుల్ కలీం ఆజాద్‌కు రంగస్థల యువ పురస్కారం లభించింది. ప్రపంచ రంగస్థల దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం హైదరాబాద్ పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో జరిగే కార్యక్రమంలో పురస్కారం అందించనున్నారు. గ్రామస్తులు, కళాకారులు ప్రజలు ఆయనకు అభినందనలు తెలిపారు.

● అబ్దుల్ కలీం ఆజాద్ సొంత గ్రామమైన చిన్నచింతకుంట మండలం అప్పంపల్లిలో 10వ తరగతి పూర్తి చేశారు. కల్వకుర్తిలో ఇంటర్మీడియట్, హైదరాబాద్ మాసబ్‌ట్యాంక్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో డిప్లొమా, జవహర్‌లాల్ నెహ్రూ కళాశాలలో ఫైన్ ఆర్ట్స్ పూర్తి చేశారు. కళారంగంపై మక్కువతో పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో రంగస్థల కళాశాలలో ఎంపీఏ థియేటర్స్ ఆర్ట్స్, పద్యనాటకంలో పీజీ డిప్లొమా పూర్తి చేశారు. ఎంపీఏ థియేటర్ చదువుతూనే రవీంద్రభారతిలో పలు నాటక ప్రదర్శనలిచ్చారు. అనంతరం రచయిత, దర్శకుడు, నటుడు, సాంకేతిక నిపుణుడిగా కొనసాగుతూ సినిమా రంగంలో రచయితగా, అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేస్తున్నారు.

రామన్‌పాడులో తగ్గిన నీటిమట్టం

మదనాపురం: రామన్‌పాడు జలాశయంలో నీటి మట్టం తగ్గుతుంది. మంగళవారం 1,011 అడుగులకు చేరింది. జూరాల ఎడమ కాల్వ, సమాంతర కాల్వ ద్వారా వచ్చే నీటిని నిలిపివేశారు. తాగునీటి అవసరాల కోసం 20 క్యూసెక్కులు నీటిని వినియోగిస్తున్నామని ఏఈ సింగిరెడ్డి రనీల్‌రెడ్డి తెలిపారు.

క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో ధ్వజస్తంభ ప్రతిష్ఠ



బాలానగర్: పెద్దరేవల్లి తిరుమలనాథ స్వామి ఆలయం వద్ద ధ్వజస్తంభ ప్రతిష్ఠ వేడుకలు వైభవంగా సాగుతున్నాయి. మంగళవారం విగ్రహమూర్తులను జలంలో ఉంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ సాధు వెంకట్ రెడ్డి దంపతులతోపాటు గ్రామస్తులు తదితరులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

ఆరుగురి బైండోవర్

మిడ్జిల్: వెలుగొమ్ములకి చెందిన కల్లం ఆంజనేయులు, కల్లం రేణుక, కత్తెర లక్ష్మమ్మ, కొండముచ్చు ఎల్లమ్మ, వారణాసి ఉస్సెనమ్మ, బోయిన్‌పల్లికి చెందిన బండారి శ్రీకాంత్‌ను మంగళవారం తహసీల్దార్ రాజునాయక్ ఎదుట బైండోవర్ చేశారు. వారిపై కేసులు నమోదైన నేపథ్యంలో ఈ మేరకు చర్యలు తీసుకున్నట్లు ఎస్‌ఐ ఆనంద్ వివరించారు. కాగా మరో కేసు నమోదు అయితే రూ.లక్ష జరిమానా చెల్లించాల్సి ఉంటుందని తహసీల్దార్ తెలిపారు.

28న గుండె వైద్య శిబిరం

పాలమూరు: జిల్లా వైద్యారోగ్యశాఖ-ఆర్‌బీఎస్‌కే ఆధ్వర్యంలో హైదరాబాద్ కేర్ ఆస్పత్రి సహకారంతో ఈనెల 28న చిన్నపిల్లలకు ఉచితంగా గుండె సంబంధ వైద్యపరీక్షలు నిర్వహించనున్నారు. జిల్లా జనరల్ ఆస్పత్రిలో ఈ మేరకు శిబిరం నిర్వహిస్తున్నట్లు వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ కృష్ణ, డీఈఐసీ మేనేజర్ దేవిదాస్ ఒక సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. 0–18ఏళ్ల వారి కోసం అన్ని రకాల పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

కాంగ్రెస్‌లో చేరిన ఎంపీటీసీ సభ్యుడు



చిన్నచింతకుంట: ఉంద్యాల ఎంపీటీసీ లక్ష్మణ్, చిన్నవడ్డేమాన్ మాజీ సర్పంచ్ ప్రభాకర్ మంగళవారం దమగ్నాపూరంలో ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేశారు. ఆయన వారికి కండువాలు కపి పార్టీలోకి ఆహ్వానించారు. అదేవిధంగా వివిధ గ్రామాలకు చెందిన వేరువేరు పార్టీ నాయకులు సైతం మంగళవారం కాంగ్రెస్‌లో చేరారు.

అధ్యక్షుడిగా నరేందర్

అడ్డాకుల: మూసాపేట మండలం సంకలమద్ది బీజేపీ గ్రామ కమిటీ అధ్యక్షుడిగా బంగ్లగడ్డకు చెందిన నరేందర్‌ను నియమించినట్లు మండలాధ్యక్షుడు రవీందర్‌గౌడ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గాజులపేట శివారులోని ఎగ్గని నర్సిములు గెస్ట్‌హౌస్ వద్ద మంగళవారం రాష్ట్ర నాయకులు సుదర్శన్‌రెడ్డి సమక్షంలో కార్యక్రమం నిర్వహించినట్లు వివరించారు.

శంకుస్థాపనను అడ్డుకుంటాం

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: అగ్రికల్చర్ యూనివర్సిటీలో హైకోర్టు నిర్మాణానికి చేయనున్న శంకుస్థాపన కార్యక్రమాన్ని అడ్డుకుంటామని బీఆర్‌ఎస్‌వీ పీయూ కన్వీనర్ గడ్డం భరత్‌బాబు పేర్కొన్నారు. ఈమేరకు మంగళవారం పీయూ గేట్ వద్ద చేపట్టిన నిరసన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అగ్రికల్చర్ యూనివర్సిటీలో అనేక రకాల జంతువులు, పక్షులు ఉన్నాయని.. ఎక్కడా స్థలం లేనట్లు ప్రభుత్వం అక్కడ నిర్మించేందుకు తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తున్నామని వివరించారు. నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. నాయకులు మహేష్, పూర్ణచంద్రరావు, శివ, ఈశ్వర్, రవీందర్, సాయి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శకటోత్సవం





ఎద్దులు, పాటేళ్లతో శకటాలు



ఆదిబసవేశ్వర స్వామి

నవాబుపేట: మండల పరిధిలోని ఆది బసవేశ్వర ఆలయం వద్ద బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్నాయి. వేడుకల్లో భాగంగా మంగళవారం శకటోత్సం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రాక్టర్లు, ఎద్దుల బండ్లను అందంగా ముస్తాబు చేసి స్వామి వారి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. వేడుకలకు గురుకుంట, పల్లెగడ్డ, కామారం, నవాబుపేట తదితర గ్రామాల ప్రజలు భారీసంఖ్యలో తరలివచ్చారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజారి శ్రీశైలం, రాజాలింగం, ఉత్సవ నిర్వాహకులు జంగయ్య, రాములు, సత్యం తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభమైన భజన పోటీలు

ఆదిబసవేశ్వరస్వామి దేవాలయ ఉత్సవాల్లో భాగంగా మంగళవారం జిల్లా స్థాయి భజన పోటీలు దేవాలయం ఆవరణలో ప్రారంభించారు. జిల్లా నుంచి 87 భజన బృందాలు ఈ పోటీలో పాల్గొననున్నట్లు నిర్వాహకులు జంగయ్య, వెంకటయ్య తెలిపారు. పోటీలు బుధవారం వరకు కొనసాగుతుండటంతో విజేతలకు బుధవారం బహుమతులు అందిస్తామని వారు వివరించారు.

మద్దిగట్లలో బోనాల ఊరేగింపు



భూత్పూర్: మండలంలోని మద్దిగట్లలో మంగళవారం ఈదమ్మ జాతర సందర్భంగా బోనాల ఊరేగింపు నిర్వహించారు. కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి చల్లా వంశీచందర్‌రెడ్డి ఈదమ్మ ఆలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం బోనాల ఊరేగింపులో పాల్గొన్నారు. ఎంపీపీ కదిరె శేఖర్‌రెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కేసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర నాయకులు రవీందర్‌రెడ్డి పలువురు కాంగ్రెస్, బీఆర్‌ఎస్, బీజేపీ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సీఎంను కలిసిన నాయకులు



దేవరకద్ర: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని దేవరకద్ర కాంగ్రెస్ నాయకులు మంగళవారం కలిశారు. హైదరాబాద్‌లోని పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో జీకేఆర్ ఫౌండేషన్ చైర్మన్ కోన రాజశేఖర్, మండల ఓబీసీ అధ్యక్షుడు గోపాల్ తదితరులు ఉన్నారు.

'టెట్' ఫీజు తగ్గించాలి



శ్రీనివాస్‌సాగర్

స్టేషన్ మహబూబ్‌నగర్: టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్ (టెట్) ఫీజును తగ్గించాలని.. బీసీ సమాజ్ ఉమ్మడి జిల్లా అధ్యక్షులు ఎం.శ్రీనివాస్‌సాగర్ మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అధిక ఫీజులు లేకుండా పోటీ పరీక్షలు నిర్వహిస్తామని కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాకముందు చెప్పిందన్నారు. కానీ ప్రస్తుతం ఉపాధ్యాయ అర్హత పరీక్షకు ఫీజులు పెంచడం ద్వారా రాష్ట్రంలోని లక్షలాది నిరుద్యోగులకు భారంగా మారుతుందని అన్నారు. నిరుద్యోగుల ప్రయోజనాల దృష్ట్యా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.

బాలానగర్‌లో పట్టుబడిన నగదు

బాలానగర్: మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టులో వరుసగా నగదు పట్టుబడుతోంది. ఎన్నికల కోడ్ నేపథ్యంలో చెక్‌పోస్టు వద్ద మంగళవారం ఎస్‌ఐ తిరుపాజీ ఆధ్వర్యంలోని పోలీస్ సిబ్బంది వెంకట్ రెడ్డి, అక్బర్, గణేష్, గోపాల్, గౌస్ బాషా, బాల్‌రాజు తదితరులు వాహనాల తనిఖీ చేపట్టారు. కాగా మొత్తం రూ. 2,18,000 పట్టుబడింది. కాగా అనంతపురం జిల్లాకు చెందిన మాల రాంమూర్తి వద్ద రూ. లక్ష, అదే జిల్లాకు చెందిన కురవ కిష్టప్ప వద్ద రూ. 64 వేలు, నాగర్‌కర్నూల్ జిల్లా తిమాజీపేట మండలానికి చెందిన ఎండీ సలీం వద్ద రూ. 54 వేలు సీజ్ చేసినట్లు ఎస్‌ఐ వివరించారు.

మద్యం పట్టివేత

బాలానగర్: గంగాదరిపల్లిలో ఓ బెల్టు షాపులో మద్యం అమ్మకాలు నిర్వహిస్తున్నారన్న సమాచారంతో ఎస్‌ఐ తిరుపాజీ ఆధ్వర్యంలో పోలీసులు మంగళవారం దాడులు నిర్వహించారు. గ్రామానికి చెందిన విజయ్ కుమార్ దుకాణంలో మొత్తం 19.2 లీటర్ల మద్యాన్ని పట్టుకున్నట్లు ఎస్‌ఐ వివరించారు. ఈ మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

అక్రమంగా ఇసుక తరలిస్తే చర్యలు

రాజాపూర్: మండలంలో ఇసుక నిషేధం ఉందని ఎవరైనా అక్రమంగా తరలించాలని చూస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ రవి పేర్కొన్నారు. మంగళవారం నందిగామ శివారులో అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను స్వాధీనం చేసుకుని కేసునమోదు చేసినట్లు వివరించారు. దుందుభీనదీ శివారులో కృత్రిమ ఇసుకను తయారీపై తమకు సమాచారం ఇవ్వాలని గ్రామస్తులను కోరారు.

అనుమతి ఇవ్వండి



మిడ్జిల్: మండలంలో అన్ని గ్రామాలలో ఇసుక లేక ప్రజలు చాల ఇబ్బంది పడుతున్నారని నాయకులు అన్నారు. ప్రభుత్వ పనులకు, అలాగే ప్రజల ఇంటి నిర్మాణాలకు, మండల పరిధిలోని అయ్యవారిపల్లిలో నిల్వ చేసిన ఇసుక సరఫరా చేయాలని మంగళవారం తహసీల్దార్ రాజునాయక్, ఎస్‌ఐ ఆనంద్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మండల బీజేపీ నాయకులు రాజేశ్వర్, తిరుపతి, నరేందర్, ఆంజనేయులు, రాములు, తదితరులు పాల్గొన్నారు.

పనిచేసిన వారికి గుర్తింపు ఇవ్వరా?

- జిల్లా కార్యాలయం ఎదుట బీజేపీ నాయకుల నిరసన



గండేడ్: బీజేపీలో పనిచేసిన వారికి గుర్తింపు ఇవ్వరా? అంటూ గండేడ్ మండల శాఖ కార్యవర్గం ఆవేదన వ్యక్తం చేసింది. మండల అధ్యక్షుడిగా విజయ్‌కుమార్ రెడ్డిని నియమిస్తూ ఆదివారం నియామక పత్రం అందజేసిన నేపథ్యంలో మాజీ అధ్యక్షుడు ప్రభునాయక్ సమక్షంలో పాత కార్యవర్గ సభ్యులు మంగళవారం జిల్లా కేంద్రంలోని కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. పార్టీకి ఏమాత్రం పనిచేయని వారిని అధ్యక్షుడిగా ఎలా నియమిస్తారంటూ ప్రశ్నించారు. ఇప్పటికైనా పని చేసే వారిని గుర్తించాలని కోరారు. జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌గౌడ్, ఉపాధ్యక్షుడు కృష్ణయ్య, నరేష్, గిరిజనమోర్చా అధ్యక్షుడు సంతోష్‌నాయక్, కోశాధికారి కృష్ణయ్య, బూత్ అధ్యక్షుడు నర్సింలు , వెంకట్రాములు తదితరులు పాల్గొన్నారు.

30న టెంకాయల టెండర్

నవాబుపేట: మండల పరిధిలోని మైసమ్మ ఆలయంలో టెంకాయల విక్రయానికి సంబంధించి జరగాల్సిన టెండర్ ఈ నెల 30న ఉంటుందని అధికారి మధనేశ్వర్‌రెడ్డి మంగళవారం తెలిపారు. కాగా ఇటీవలే కార్యక్రమం నిర్వహించాల్సి ఉన్నా.. టెండరుదారులు నిబంధనలు పాటించకపోవటంతో వాయిదా వేసినట్లు వివరించారు.

పశువులకు గాలికుంటు నివారణ టీకాలు

బాలానగర్: ప్రతి రైతు పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేయించాలని మండల పశువైద్య అధికారి రఘురాం అన్నారు. మంగళవారం తిరుమలగిరి, నేరెళ్లపల్లి గ్రామాల్లో మొత్తం 268 ఆవులు, 131 గేదెలకు గాలికుంటు నివారణ టీకాలు వేసినట్లు వివరించారు. సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

నేడు బీజేపీ కార్యాలయం ప్రారంభం

జడ్చర్ల టౌన్: పట్టణంలోని వెంకటేశ్వరకాలనీలో బీజేపీ పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించనున్నారు. ఎంపీ అభ్యర్థి డీకే అరుణ, జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి తదితరులు కార్యక్రమానికి వస్తారని పట్టణ అధ్యక్షుడు సామల నాగరాజు మంగళవారం తెలిపారు. నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు.

ఎన్‌ఎస్‌యూఐ పట్టణ కమిటీ నియామకం

స్టేషన్ మహబూబ్‌నగర్: నేషనల్ స్టూడెంట్స్ యూనియన్ ఆఫ్ ఇండియా (ఎన్‌ఎస్‌యూఐ) పట్టణ నూతన కమిటీని నియామకం చేశారు. ఈ మేరకు ఎన్‌ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షులు, ఎమ్మెల్సీ బల్లూరు వెంకట్ నూతన కమిటీని నియామకం చేస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఎన్‌ఎస్‌యూఐ పట్టణ కమిటీ అధ్యక్షుడిగా నరేష్ యాదవ్, ఉపాధ్యక్షుడిగా మహ్మద్ అర్బాత్, ప్రధాన కార్యదర్శులుగా నవీన్ యాదవ్, మహ్మద్ అఖిల్, కార్యదర్శులుగా యాదగిరి, జాహెదుల్లా, ప్రవీణ్‌లను నియమించారు. పట్టణ నూతన కమిటీని ఎన్‌ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు మహ్మద్ అవేజ్ అహ్మద్, రాష్ట్ర కార్యదర్శి రమేష్ అభినందించారు.

పోస్టర్ ఆవిష్కరణ

మరికల్: మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో జరిగే అంబేద్కర్ జాతరను జయప్రదం చేయాలని టీఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు సి.బాలరాజు అన్నారు. మండలంలో మంగళవారం జాతర పోస్టర్‌ను విడుదల చేశారు. 27న కార్యక్రమం ఉంటుందన్నారు. బాల్‌రాజ్, రామస్వామి, బాలకృష్ణ పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ



చెక్కులతో లబ్ధిదారులు

నవాబుపేట: గత ఏడాది కల్యాణలక్ష్మి చెక్కులకు సంబంధించి సాంకేతిక ఇబ్బందులు రావటంతో వాటిని తిరిగి లబ్ధిదారులకు అందించినట్లు తహసీల్దార్ నాగ్యనాయక్ తెలిపారు. మంగళవారం తమ కార్యాలయంలో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 8 మందికి చెక్కులు అందజేసినట్లు వివరించారు. కార్యక్రమంలో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన లబ్ధిదారులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బాండ్ల పేరుతో బీజేపీ స్కామ్ : కాంగ్రెస్



స్టేషన్ మహబూబ్‌నగర్: రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని ఎదుర్కొలేకే పార్టీకి సంబంధించిన బ్యాంకు ఖాతాలను కుట్రపూరితంగా ఫ్రీజ్ చేశారని టీపీసీసీ అధికార ప్రతినిధి జహీర్ అక్తర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పార్టీని ఆర్థికంగా దెబ్బతీయాలనే లక్ష్యంతోనే కేంద్రంలోని మోదీ ప్రభుత్వం ఇలాంటి చర్యలకు పాల్పడిందన్నారు. ఎన్నికుట్రలు చేసినా విజయాన్ని ఆపలేరని అన్నారు. ఎలక్టోరల్ బాండ్ల పేరుతో బీజేపీ ప్రభుత్వం పెద్దస్కాం చేసిందని ఆరోపించారు. దేశంలోని ప్రభుత్వ సొమ్మును లూటీ చేస్తున్నారని విమర్శించారు. బాండ్లను తీసుకునేలా పెద్ద కంపెనీలపై ఒత్తిడి చేసిందన్నారు. దేశంలోని 38 పెద్ద కంపెనీలకు 179 కాంట్రాక్టులు ఇవ్వడంలో అంతర్యమేమిటో ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. మీడియాసెల్ కన్వీనర్ సీజే బెనహర్, మండల అధ్యక్షుడు మల్లు నర్సింహారెడ్డి పాల్గొన్నారు.

ధర్మభిక్షం ఆశయాలను కొనసాగిస్తాం



నివాళి అర్పిస్తున్న నాయకులు

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): తెలంగాణ రైతాంగా సాయుధ పోరాట రథసారధి ధర్మభిక్షం ఆశయాలను కొనసాగిస్తామని సీపీఐ జిల్లా కార్యదర్శి బాలకిషన్ అన్నారు. మంగళవారం ఆ పార్టీ కార్యాలయంలో ధర్మభిక్షం వర్ధంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళి అర్పించారు. కౌన్సిల్ సభ్యులు చాంద్ పాషా, సత్యనారాయణరెడ్డి, ఖాజామైనోద్దీన్, హనుమంతు, బాలరాజు, ఆంజనేయులు, గోపీ పాల్గొన్నారు.

రైతులకు రుణమాఫీ చేయాలి

చిన్నచింతకుంట: కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే రుణమాఫీ, రైతుబంధు ఇచ్చి అన్నదాతలను ఆదుకోవాలని బీజేపి పార్లమెంట్ కన్వీనర్ కుర్వ రమేష్, కో కన్వీనర్ భరత్ భూషణ్ డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలో తహసీల్దార్ కృష్ణయ్యకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చలేదని ఆరోపించారు. ఎన్నికల కోసమే హామీలు ఇచ్చి రైతులను మోసం చేశారని మండి పడ్డారు. భూగర్భ జలాలు అడుగింటి బోరుపంపులల్లో నీరు రాక రైతులు సాగు చేసిన పంటలు ఎండిపోతున్నాయని ఆవేదన చెందారు. పెట్టిన పెట్టుబడులు రాలేని పరిస్థితులలో రైతులు ఉన్నారని పంట పెట్టు బడులకు తెచ్చిన అప్పులు తీర్చలేక ఆత్మహత్యలకు పాలు పడే పరిస్థితులు దాపరిస్తున్నాయన్నారు. వెంటనే రైతులను ఆదుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. మండల అధ్యక్షుడు దశరథ్ తదితరులు పాల్గొన్నారు.

ఆదుకోవాలి

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): నీరులేక పంటలు ఎండిపోతుండడంతో రైతులు నష్టపోయే ప్రమాదం ఉందని.. వారిని అన్నివిధాలుగా ఆదుకోవాలని తెలంగాణ ప్రజా ఫ్రంట్ జిల్లా సమన్వయ కర్త బిచ్చారెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. రైతులను ఆదుకోవాల్సిన ప్రభుత్వం రాజకీయాలు చేస్తుందని ఆరోపించారు. వెంటనే ఆదుకోవాలని కోరారు.

ఆంగ్లం బోధనపై సమీక్ష



మాట్లాడుతున్న ఎంఈఓ రాజునాయక్

హన్వాడ: వచ్చే విద్యాసంవత్సరం నుంచి మండలంలోని పలు పాఠశాలల్లో ఆంగ్ల విద్యాబోధన ప్రారంభిస్తున్నట్లు జిల్లా విద్యాధికారి రవీందర్ పేర్కొన్నారు. మంగళవారం మండలకేంద్రం లోని ప్రాథమిక పాఠశాలలో ఆంగ్లబోధనపై సమీక్ష సమావేశం నిర్వహించారు. మండలంలోని పలు పాఠశాలల్ని ఎంపిక చేసినట్లు వివరించారు. బోధనపై ఆర్‌పీల సూచనలు, సలహాలు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. రిటైర్డ్ డీఈఓ విజయకుమార్, ఎంఈఓ రాజునాయక్, సీఎంఓ బాలుయాదవ్, ఆర్‌పీ రజాక్ తదితరులు పాల్గొన్నారు.

హోలీ సంబురం



కందూర్‌లో వేడుకలు నిర్వహిస్తున్న గ్రామస్తులు

అడ్డాకుల: కందూర్‌లో మంగళవారం హోలీ నిర్వహించారు. రామలింగేశ్వరస్వామి రథోత్సవం పూర్తయిన మరుసటి రోజు పండుగ నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఉదయం ఆలయం నుంచి రంగు నీళ్లను మట్టి కుండల్లో గ్రామానికి తీసుకువచ్చారు. గ్రామంలోని ఇతర ఆలయాల్లో నీళ్లను చల్లారు. అనంతరం పండుగ జరుపుకొన్నారు.

ప్రత్యేక బలగాల కవాతు



కవాతు నిర్వహిస్తున్న ప్రత్యేక బలగాలు

దేవరకద్ర: నియోజకవర్గ కేంద్రంలో మంగళవారం సాయంత్రం ప్రత్యేక బలగాలు కవాతు నిర్వహించాయి. జిల్లా కేంద్రం నుంచి వచ్చిన అడిషనల్ ఎస్పీ సురేష్‌కుమార్ ఆధ్వర్యంలో ప్రత్యేక బలగాలు పట్టణంలోని పలు వీధుల గుండా కవాతు నిర్వహించారు. ఎంపీ ఎన్నికల నేపథ్యంలో కార్యక్రమం చేపట్టారు. ఎస్‌ఐ నాగన్న తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి'పై శ్రద్ధ వహించాలి



సోషల్ ఆడిట్‌లో పాల్గొన్న అధికారులు

బాలానగర్: ఉపాధి హామీ పనులపై గ్రామ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్‌లు ప్రత్యేక శ్రద్ధ వహించాలని అదనపు డీఆర్‌డీఓ ముసాయిదా అన్నారు. మంగళవారం 14వ విడత ఎస్‌ఆర్‌ఈజీఎస్ సోషల్ ఆడిట్‌లో భాగంగా మండల పరిధిలోని 37 గ్రామాల్లో జరిగిన అభివృద్ధి పనులు, హరితహారం కార్యక్రమంలో భాగంగా నాటిన మొక్కలపై ఆరా తీశారు. విధుల్లో నిర్లక్ష్యం వహించిన వారికి రికవరీ కోసం చర్యలు చేపట్టనున్నట్లు ఆమె తెలిపారు. మండలపరిధిలో జరిగిన మొత్తం ఈజీఎస్ పనుల విలువ రూ. 3,60,18,697 కాగా అందులో రూ. 16,100 రికవరీ చేసినట్లు ఆమె తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరికీ పని కల్పించాలి



కూలీలతో మాట్లాడుతున్న ఎంపీడీఓ కరుణశ్రీ



కూలీలతో మాట్లాడుతున్న ఎంపీడీఓ శ్రీనివాసరావు

మహబూబ్‌నగర్ రూరల్: జాబ్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ 100 రోజుల పని కల్పించాలని ఎంపీడీఓ కరుణశ్రీ అన్నారు. మంగళవారం బొక్కలోనిపల్లి గ్రామంలో చేపడుతున్న ఉపాధి పనులను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ వేసవి దృష్ట్యా ఉదయం, సాయంత్రం వేళల్లో పనులు పూర్తి చేసుకోవాలని కూలీలకు సూచించారు. ఉపాధిహామీ కూలీలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామని అన్నారు. అనంతరం కూలీలకు ఓఆర్‌ఎస్ ప్యాకెట్లను అందజేశారు. ఎంపీడీఓ వెంట పంచాయతీ కార్యదర్శి భరత్‌సింహారెడ్డి, ఫీల్డ్ అసిస్టెంట్ బాబురావు ఉన్నారు.

దేవరకద్ర: కొత్త బస్టాండ్ సమీపంలోని మల్లెల పాపయ్య కుంటలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను మంగళవారం ఎంపీడీఓ శ్రీనివాసరావు పరిశీలించారు. అక్కడ పనిచేస్తున్న కూలీలకు సంబంధించిన మస్టర్‌ను తనిఖీ చేశారు. అలాగే కూలీల పేర్లను చదివి వారి హాజరును పరిశీలించారు. నెలరోజులుగా ముమ్మరంగా సాగుతున్న కుంట పూడిక తీత పనులు ఏ మేరకు జరిగాయో ఏపీఓ సంజీవ్ కుమార్, ఫీల్డ్ అసిస్టెంట్ వీరాంజనేయులను అడిగి తెలుసుకున్నారు.